క్లుప్తంగా

గర్భిణులు వైద్య సలహాలు పాటించాలి



గర్భిణులకు జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యులు

కరప: గర్భిణులు వైద్య సలహాలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ఎస్.ఏలీనా సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ జీహెచ్‌ఓ ఏసురత్నం, పీహెచ్ఎన్ సత్యనారాయణ, హెచ్‌వీ సీత గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగరు టెస్ట్‌లు నిర్వహించి, మందులు అందజేశారు. మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచనలమేరకు పాస్టర్ మోహనరావు జ్ఞాపకార్థం ఆయన మనవరాలు ఫ్లోరా పుట్టినరోజు సందర్భంగా గర్భిణులకు పండ్లు, బ్రెడ్, డ్రై ఫ్రూట్స్ కిట్లను అందజేశారు. పీఏసీఎస్ మాజీచైర్మన్ నక్కా వీరభద్రరావు, దేవు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



ఐవీఆర్ కాల్స్ గురించి అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

కరప: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. కరపలో శుక్రవారం ఆయన గ్రామకార్యదర్శి యు.నిర్మలాదేవితో కలసి పర్యటించి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. తడి, పొడిచెత్తను విడదీసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, నీరునిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయించాలన్నారు. పంచాయతీ పనితీరుపై వచ్చే ఐవీఆర్ కాల్స్‌కు ఎలా స్పందించాలనేది వారికి వివరించారు. తర్వాత ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి, కేంద్ర నిర్వహణను పరిశీలించారు.

వన్యప్రాణి వారోత్సవాల పోటీల్లో ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

బాలాజీచెరువు: జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా అటవీశాఖ నిర్వహించిన పలు పోటీల్లో గీతమ్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డ్రాయింగ్ విభాగంలో కె.మహాలక్ష్మి తృతీయ స్థానం (కేటగిరి వన్), డి.త్రిమయణిశ్రీ తృతీయ స్థానం (కేటగిరి–2), బి.అచ్యుత్‌శంకర్ తృతీయ స్థానం (కేటగిరి–2) సాధించారు. వ్యాసరచన విభాగంలో ఏ.శ్రీకర్ ప్రథమ స్థానం, డి.రాజసుదర్శన్ ద్వితీయ స్థానం, జి.త్రినయనశ్రీ కన్సోలేషన్ బహుమతి, డీపీఎస్ అనసూయాంబ కన్సోలేషన్ సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ ఎస్.శారద అభినందించారు.

మూడు కుటుంబాలకు ఆర్థిక సాయం

కాకినాడ క్రైం: వివిధ సమస్యలతో బాధపడుతున్న మూడు కుటుంబాలకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం అండగా నిలిచింది. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తూరంగికి చెందిన మూడు న్నరేళ్ల బాలుడి వైద్యానికి రూ.50 వేలు, బుడంపేటకు చెందిన రాజేష్ కుటుంబానికి రూ.40 వేలు, కాకినాడ డైరీఫారం చెందిన మణికంఠకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ సహా దాతలు ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న అసోసియేషన్ నాయకులు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా చైర్మన్ పి.మహేశ్వరరావు అన్నారు. వాలిడేషన్ చట్టం రద్దు, 8వ వేతన సంఘం సిఫార్సులు అందరి పెన్షనర్స్‌కు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత హెడ్ పోస్టాఫీసు నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకూ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జీవీ లక్ష్మీనారాయణ, డి.మాణిక్యాలరావు, సీహెచ్ రామారావు, ఎం.కూర్మారావు, ఎన్.త్రినాథరావు, సురేష్‌రెడ్డి, ఎం.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

- ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ
- పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నేతలు



కాకినాడ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, ప్రతినిధి, కాకినాడ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో ప్రతి కార్యకర్త ప్రత్యక్ష, పరోక్ష ఆందోళనకు ముందుకు రావాలని పార్టీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి రాగిరెడ్డి దీప్తికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకర, రాగిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సహకారంతో కోటి సంతకాలు సేకరించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి 17 వైద్య కాలేజీలను తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చే సంకల్పంతో జగన్ కేంద్రంతో పోరాడి ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలను తీసుకువచ్చారన్నారు. వాటిలో ఐదు కాలేజీలను పూర్తిచేయగా మిగిలిన 80 శాతం పూర్తి అయ్యాయన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిన తరుణంలో కూటమి సర్కార్ గద్దెనెక్కి వాటిని పప్పుబెల్లాల మాదిరిగా కార్పొరేట్ శక్తులకు విక్రయించేందుకు పీపీపీ అంటూ ప్రైవేటీకరణకు సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. పేదలకు వైద్య విద్యను దూరం చేయాలన్నదే చంద్రబాబు ఆలోచనగా కనిపిస్తోందన్నారు. ప్రైవేటీకరణపై పార్టీ ఇచ్చిన పిలుపునకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అనిల్‌కుమార్ (బన్నీ), పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూరి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చెక్క చక్రవర్తి, సీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కయాకింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



కయాకింగ్ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

బాలాజీచెరువు: కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ పరిధిలోని వివిధ యూనిట్లకు చెందిన 70 మంది స్వచ్ఛంద క్యాడెట్ల కోసం 5 రోజుల పాటు నిర్వహించే కయాకింగ్ శిక్షణ శిబిరం స్థానిక పోర్టులో శుక్రవారం ప్రారంభమైంది. కమాండర్ అజయ్ యాదవ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి రిమ్స్ కళాశాల సహకరిస్తోంది. ఈ శిబిరం ద్వారా కేడెట్లకు కయాకింగ్ నైపుణ్యాలు, నీటిలో భద్రతపై శిక్షణ అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. శిబిరంలో కయాకింగ్‌కు సంబంధించిన సిద్ధాంతం ప్రామాణిక అంశాలు, భద్రతా నియమాలు, పడవ నడిపే పద్ధతులు, ప్రాథమిక నేవిగేషన్, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణ సాంకేతికతలు మరియు ప్రథమ చికిత్స వంటి అంశాలను బోధించనున్నారు. అలాగే యువ ఆపద మిత్ర స్కీమ్ (వైఏఎమ్ఎస్)లో స్వచ్ఛందంగా పాల్గొనే క్యాడెట్లకు విపత్తు నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నారు.

మనో నిబ్బరాన్ని పెంచుకోవాలి



జీజీహెచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు, అధికారులు

కాకినాడ క్రైం: ప్రతి ఒక్కరూ మనో నిబ్బరాన్ని పెంచుకోవాలని సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వానపల్లి వరప్రసాద్ అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ముఖ్య అతిథిగా మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మనం మనసుకు చెప్పి ఉన్న విషయాన్నే మనసు మనకు చెబుతుందని, అంతే తప్ప మనసు మనకేమీ చెప్పేది ఉండదని తెలిపారు. మనసు నిబ్బరాన్ని పెంపొందించుకోగలిగితే మానసిక ఆరోగ్యం సుస్థిరమవుతుందని అన్నారు. తద్వార వ్యక్తి జీవితం బంగారుమయమవుతుందని తెలిపారు. శారీరక సమస్యలలాగే, మానసిక వేదనకు కూడా అత్యవసర స్థితిని కల్పిస్తాయని అన్నారు. ఇటువంటి స్థితిని అధిగమించేందుకు ముందు మానసికంగా సంసిద్ధులం కావాలని తెలిపారు. మనో వేదనకు మందు ఉందని చెబుతూ సానుకూలం కాని మానసిక మార్పులు వ్యక్తిలో కనిపిస్తే తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. కాకినాడ జీజీహెచ్‌లో నాణ్యమైన మానసిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సైకియాట్రీ డిపార్టుమెంట్ వైద్యులు సహా నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ బోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

- జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్
- ఉత్సాహంగా హాక్‌థాన్–25



హాక్‌థాన్‌లో పాల్గొన్న వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఇంక్యుబేషన్ డైరెక్టర్ గోపాలకృష్ణ

బాలాజీచెరువు: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఏలీప్‌హబ్, డైరక్టర్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో హాక్‌థాన్–25 నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్, ఒక కుటుంబం–ఒక వ్యాపారవేత్త వంటి కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థుల ఆవిష్కరణలు దేశ జీడీపీ పెరుగుదలకు, భారత ఉత్పత్తిరంగం అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. భవిష్యత్‌లో జేఎన్‌టీయూకే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రతిభావంతులైన ఆవిష్కరణలకు నిధులు అందించడాన్ని సులభతరం చేస్తుందన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలకు సహకరించడంలో ఇంక్యుబేషన్ సెంటర్ పాత్ర తెలియజేశారు. హాక్‌థాన్‌లో 180 మంది విద్యార్థులు పాల్గొని 20 ప్రతిపాదనలు తయారుచేయగా టాప్–3 అంశాలను ఎంపికచేశారు. ఆధునిక ఫ్లైట్ కంట్రోలర్ (అజయ్, శామ్సన్, ప్రీతమ్‌ల బృందం. స్కూల్ ఆఫ్ ఎవాయినిక్స్), ఆటోనమస్ షిప్‌హోల్‌బార్నికల్ తొలగింపు (శ్రవణ్, లక్ష్మి, సాత్విక, విష్ణుల బృందం. ఈసీఈ విద్యార్థులు), ఏఐ ఆధారిత పీడీఎఫ్ ఎడిటర్ (లలిత, తరుణ్, రేవంత్, లక్ష్మి బృందం,సీఎస్ఈ విద్యార్థులు)లు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ



టౌన్‌హాల్ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జుబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ ఇన్నట్లు క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. స్థానిక రోటరీ హాల్‌లో శుక్రవారం క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈనెల 26న విజయనగరంలో రోటరీ ఫౌండేషన్ సెమినార్ జరుగుతుందని క్లబ్ నుంచి అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొంటారన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్, సీనియర్ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, దంగేటి ప్రసాద్ టౌన్‌హాల్ కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, క్లబ్ మాజీ అధ్యక్షుడు ఉదయభాను, సభ్యులు నరహరిశెట్టి, రవికృష్ణ, చిరంజీవిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

బాలాజీచెరువు: స్థానిక రామరావుపేట లయన్స్ క్లబ్ హాల్లో శనివారం ఉదయం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు తెలిపారు. జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి రెడ్‌క్రాస్, జీజీహెచ్ సంస్థలకు అందజేస్తున్నామన్నారు. క్లబ్ సభ్యులతో పాటు స్వచ్ఛందంగా రక్తదానం చేసేవారు పాల్గొనవచ్చని సూచించారు.

లబ్ధిదారులకు పథకాలు అందాలి



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలని ఎంపీ, దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) చైర్మన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు, సమన్వయం, పర్యవేక్షణకు దిశ కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వివరించారు. అనంతరం ఎజెండాలోని బ్యాంకింగ్ పథకాలు, వైద్యారోగ్య తదితర పథకాల లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్టు ఎంపీ ఉదయ్ పేర్కొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నాటు సారా నిర్మూలనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్ వివేకానంద హాలులో శుక్రవారం ఎస్పీ బిందు మాధవ్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుకతో ఈ విషయమై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. నవోదయం 2.0 ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సారా తయారీ, రవాణా, విక్రయాలపై ఇకపై కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో గుర్తించిన 136 గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జెడ్పీలో పలువురికి పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా పరిషత్‌లో పలువురికి పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం వారికి ఉత్తర్వులు అందించారు. నలుగురు సీనియర్ సహాయకులకు ఒక గ్రేడ్ 1 వీడీఓకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పించారు. మరొక వ్యక్తికి కారుణ్య నియామకం ద్వారా ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

కాకినాడ రూరల్: స్థానిక ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు బృందం గంగానపల్లి, కొవ్వూరు గ్రామాలలోని బాణసంచా తయారీ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలోని భద్రతా పరికరాలను పరిశీలించి యజమానులకు చట్టపరమైన నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, అనుసరించవలసిన జాగ్రత్తలను వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: భార్యతో గొడవపడి క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వలసపాకలకు చెందిన మండపల్లి చిన్నబ్బాయి కూలిపని చేస్తుంటాడు. గత నెల 15వ తేదీ సాయంత్రం అతని భార్య కమలతో అతడు గొడవపడ్డాడు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో జీవితంపై విరక్తిచెంది ఊరి చివర ఉన్న మర్రిచెట్టు వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను వాంతులు చేసుకోవడం చూసిన అదే గ్రామానికి చెందిన సుధీర్, రాకేష్ మోటార్‌సైకిల్‌పై చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. అప్పటి నుంచి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కుటేశుని దర్శిద్దామా..

- కార్తిక మాసోత్సవాలకు పాదగయ సిద్ధం
- ప్రత్యేక పూజలకు అధికారుల ఏర్పాట్లు
- నిత్యం లక్షపత్రి పూజలు, అభిషేకాలు



పాదగయ క్షేత్రం

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసోత్సవాలకు స్థానిక స్థానిక కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలోని ఈ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువ ఉండే దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాల కోసం పాదగయకు తరలి వచ్చే అవకాశం ఉండడంతో పుష్కరిణిలో పాత నీటిని ఇప్పటికే తొలగించగా కొత్త నీటిని నింపే పనులను ప్రారంభించారు. కార్తిక దీపాలను వదిలేందుకు, దీపారాధనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక పూజల నిర్వహణకు ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కార్తికంలో నిత్యం స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. కార్తికమాసాన్ని పురస్కరించుకుని పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరిస్తున్నారు.

తలపట్టుకుని వారు..
తీరుబడిగా వీరు!

- కాకినాడ గాంధీనగర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియం వద్ద జి.శివకుమార్ గత ఏడాది డిసెంబర్ 18 తేదీన ఉదయం 6 గంటల సమయంలో స్ప్లెండర్ ప్లస్ బండి పెట్టి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పటికి బండి కనబడలేదు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని బాధితుడు ఆవేదన.
- కాకినాడ రామారావుపేట, వేలమూరివారి వీధిలో న్యాయవాది ఇంటి ముందు ఉన్న హోండా యాక్టివా ఈ ఏడాది జూలై 3న చోరీకి గురైంది. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదంటూ ఆయన గగ్గోలు..
- కాకినాడ కొండయ్యపాలెంలో నివసిస్తున్న కొండపు గౌరి ఒంటిమామిడి జంక్షన్ హోటల్లో పని చేస్తాడు. అతడి ఇంటి ముందు ఉన్న పల్సర్ ఈ నెల 3న ఎవరో పట్టుకుపోయారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ దాని అతీగతీ లేదు.
- కాకినాడ బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలో ఈ నెల ఒకటిన శ్రీదేవి అనే మహిళ తన బండిని పెట్టి వెళ్లారు. ఆమె తిరిగి వచ్చేటప్పటికి బండి లేదు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే బండి దొంగిలిస్తున్నట్టు నమోదైన సీసీ పుటేజీని పోలీసులకు అందజేశారు. ఆధారాలిచ్చినా దర్యాప్తులో జాప్యమేంటన్నది ఆమె ప్రశ్న..



బండి చోరీ చేసేందుకు ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నట్టుగా.. స్టార్ట్ చేసే ప్రయత్నం.. బండితో ఉడాయిస్తూ..
కాకినాడ బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలో సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలివి..

- పోయేది వందల్లో.. కేసులు పదుల్లో!
- వాహన చోరీలపై పోలీసుల కుయుక్తులు
- ఆందోళన చెందుతున్న వాహన చోదకులు

కాకినాడ లీగల్: ఇవన్నీ కొన్ని వాహన చోరీలకు సంబంధించిన ఘటనలు. కాకినాడ నగరంలో గాంధీ నగర్ పార్క్, వివేకానంద పార్క్, ఆలయాలు, కార్యాలయాలు వద్ద బండి పెట్టి లోపలకు వెళ్లొచ్చే సరికి అది అక్కడ ఉంటుందని చెప్పలేని పరిస్థితి. అలాగే రాత్రిపూట ఇళ్ల ముందు పెట్టిన బళ్లు ఉంటాయో.. పోతాయో తెలియని సంశయం. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్ట్, ఇంద్రపాలెం, సర్పవరం పోలీసు స్టేషన్ల పరిధిలో గత ఏడాదిలో వందల సంఖ్యలో వాహనాలు అపహరణకు గురైనా కేసుల నమోదు అంతంత మాత్రమేనని బాధితుల వాదన.

జాప్యం ఎందుకో..

నేర సమీక్షలో తక్కువ కేసులు చూపెట్టడానికే బండి పోయిందని చెప్పినా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజుల పాటు నాన్చిన తర్వాతే ఫిర్యాదును పరిశీలిస్తారు. ఈ లోగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోరు. ఏదైనా కేసు నమోదైతే వెంటనే పరిష్కరించాలి. ఆ వివరాలను నేర సమీక్షలో వెల్లడించాలి. కేసు నమోదు చేయకపోతే ఆ సమస్యే లేదన్నట్టు పోలీసులు వ్యవహరిస్తున్నారని బాధితులు అంటున్నారు.

బండి పట్టుకున్నాకే కేసు

టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులకు ఎక్కువగా బందోబస్తు విధులు ఉంటాయి. దీంతో పోలీసులు తక్కువగా ఉంటారు. ఇదే అవకాశంగా ఎవరైన ఫిర్యాదులు చేయడానికి వస్తే అక్కడి సిబ్బంది కేసులు నమోదు చేయడం లేదు. అయితే దొంగ దొరికినపుడు మాత్రం అదంతా తమ ఘనతేనని చెప్పుకోవడానికి ఆదరాబాదరాగా కేసు నమోదు చేసేసి నిందితుడిని పట్టేసుకున్నట్టు కేసు మూసేస్తారు. కాకినాడలో పలు స్టేషన్లో వందలాది బాధితులు ఉండగా బండి దొరకగానే ఫిర్యాదులు నమోదు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని బాధితులు కోరుతున్నారు.

ఎవరిది బాధ్యత?

వాహనం చోరీపై కేసు నమోదు చేయకుంటే ఆ వాహనాన్ని తీసుకువెళ్లిన వ్యక్తి ఏదైనా యాక్సిడెంట్ చేసినా, ప్రమాదానికి గురైనా బాధ్యత ఎవరు తీసుకుంటారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య రాకుండా ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేయాలని బాధితులు సూచిస్తున్నారు.

ఆధారం లేకపోతే ఇబ్బందే



బండి చోరీ జరిగినప్పుడు బండి యజమాని వద్ద ఎటువంటి ఆధారం లేకపోతే ఇబ్బంది పడతారు. చోరీ జరిగిన బండితో వేరే ప్రాంతంలో ఏమైనా యాక్సిడెంట్ జరిగినా, ఆ బండిపై మాదకద్రవ్యాలు ఉన్నా ముందుగా బండి యజమానినే పోలీసు విచారిస్తారు. అయితే బండి యజమాని వద్ద ఎటువంటి ఆధారం లేకపోవడం వల్ల వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. బండి చోరీ జరిగిన వెంటనే పోలీసులు వద్ద నుంచి ఏదో ఆధారం తీసుకోవాలి. లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తెనుకువెళ్లాలి.

వి.రాజు,న్యాయవాది,
కాకినాడ బార్ అసోసియేషన్

రేపటి నుంచి కోకనాడ షాపింగ్ సంబరాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలు సామాన్య ప్రజలకు తెలిసేలా ఈ నెల 12 నుంచి 19 వరకు కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.శ్రీలక్ష్మి వివిధ శాఖల అధికారులు, వ్యాపార సంఘాల ప్రతినిధులతో జీఎస్టీ 2.0పై సమావేశం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌లో భాగంగా వ్యాపార సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగరంలోని పైడా చలమయ్య కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పిల్లల్ని ఎత్తుకెళ్లడం అబద్ధం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి పిల్లల్ని ఎత్తుకెళ్లాడని జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ఆసుపత్రి అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అత్యుత్సాహంలో తప్పుడు పోస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురిచేయవద్దని కోరారు. ఓ మానసిక రోగి పిల్లల వార్డు వద్ద సంచరించి కొందరితో వాదన పెట్టుకున్నాడని ఆ విషయాన్ని పిల్లల కిడ్నాప్‌గా చిత్రీకరించి తప్పుడు ప్రచారాలు చేశారని అన్నారు.